సాక్షి
తూర్పుగోదావరి

శనివారం | 17 | మే | 2025



రూ.1.64 లక్షల విరాళం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరుని క్షేత్రంలో అన్నప్రసాద భవన నిర్మాణానికి కొల్ల మునేశ్వరరావు దంపతులు (అంబాజీపేట) రూ.1,63,905 విరాళం సమర్పించారు.




చోరీ కేసును ఛేదించిన పోలీసులు

దోసకాయలపల్లిలో ఈ నెల 11వ తేదీన చోరీకి గురయిన రోవర్ మెషీన్, ల్యాబ్, లైటర్లను రికవరీ చేసినట్టు కోరుకొండ సీఐ సత్య కిషోర్ తెలిపారు.

II లో

కడలిలోకి 2,820 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 2,820 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

సమస్యలపై ప్రజాపోరు



సమీక్షా సమావేశంలో బొత్స సత్యనారాయణ, పార్టీ నేతలు



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి సమావేశానికి వచ్చిన పార్టీ నేతలు

- ప్రజలతో నేతలు మమేకమవ్వాలి
- ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అండ
- ఆక్వా రైతులకు వెన్నుదన్ను
- క్షేత్ర స్థాయి పర్యటనలకు అధినేత జగన్
- ప్రతి 10 రోజులకు వైఎస్సార్ సీపీ జిల్లా సమావేశం
- జూన్ లోగా మండల కమిటీలు
- జూలైనాటికి గ్రామ కమిటీలు
- కాకినాడ సమీక్షలో పార్టీ నేత బొత్స దిశానిర్దేశం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సమస్యలపై ప్రజా భాగస్వామ్యంతో ప్రభుత్వాన్ని మేలుకొల్పేలా పోరుబాటకు వైఎస్సార్ సీపీ సిద్ధమవుతోంది. ఇందుకు పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా రానున్న రెండు నెలల్లో మండల, గ్రామ కమిటీల నియామకాలు పూర్తి చేయాలని పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే జూన్ లోగా ఇంకా మిగిలిన మండలాలు, జూలైకల్లా గ్రామ స్థాయి కమిటీల నియామకాలు పూర్తి చేయాలని సూచించారు. కాకినాడ డి-కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగిన పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమవ్వాలనేది ప్రధాన అజెండాగా నిర్ణయించారు. ఇందుకోసం ప్రజల సమస్యలపై పార్టీ స్థానిక నాయకత్వాలు శాంతియుత పంథాలో నిరసన కార్యక్రమాలు రూపొందించుకోవాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి నాయకత్వాన నిర్వహించిన ఆందోళనలపై ఈ సమీక్షలో చర్చించారు. ఇదే తరహాలో సమస్యలపై పోరుబాటకు సన్నద్ధం కావాలని నేతలకు బొత్స సూచించారు. జిల్లా స్థాయిలో సైతం పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని తీర్మానించారు. దీని కోసం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 50 రోజుల కార్యక్రమాన్ని ఖరారు చేశారు. వచ్చే జూన్ 1 నుంచి ప్రతి 10 రోజులకు ఒక జిల్లాలో పార్టీ జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశాలను ఐదు జిల్లాల్లో 50 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

రైతులకు అండగా..

- ప్రధానంగా వివిధ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని బొత్స తెలిపారు. కళ్లాల్లో ధాన్యం ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయంపై ఈ సందర్భంగా చర్చించారు. ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతున్న మాటలకు.. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితికి అసలు పొంతనే లేదని నేతలు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. ఈ విషయంలో రైతుల ఇబ్బందులు తెలుసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించి, వారితో మాట్లాడి, అండగా నిలవాలని నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు.
- ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న నష్టాలకు ప్రభుత్వ విధానాలే కారణమని నిర్ధారించారు. రొయ్యల ధరలు పడిపోవడం, మేత ధరలు అడ్డగోలుగా పెరిగిపోయి రైతులు నష్టపోతున్నా సర్కార్‌కు చీమ కుట్టినట్టయినా లేదని, ఆక్వా రైతులకు వెన్నంటి నిలవాలని తీర్మానించారు.
- గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మాదిరిగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పొగాకు రైతులకు అండగా నిలిచి, పోరాడటానికి సిద్ధంగా ఉండాలని నిర్ణయించారు.
- ప్రధానమైన ప్రజా సమస్యలపై పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో పర్యటించేందుకు సైతం సిద్ధంగా ఉన్నారని బొత్స వివరించారు.
- సూపర్ సిక్స్ సహా కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలయ్యే వరకూ ప్రభుత్వంపై ప్రజాపోరులో ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా బాధ్యత తీసుకోవడానికి నాయకులు ముందుకు వచ్చారు.
- క్షేత్ర స్థాయిలో పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, పార్టీ శ్రేణులు, ప్రజలకు అండగా నిలిచి, మనోధైర్యం కల్పించాలని తీర్మానించారు.

సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, పండుల రవీంద్రబాబు, అనంత బాబు, బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్టీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం, పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రులు పినిపే విశ్వరూప్, తానేటి వనిత, తోట నరసింహం, గొల్లపల్లి సూర్యారావు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్టీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎంపీలు వంగా గీత, చింతా అనురాధ, మార్గాని భరత్‌రామ్, గిరజాల స్వామినాయుడు, పార్లమెంటరీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పొన్నాడ సతీష్ కుమార్, జ్యోతుల చంటిబాబు, రౌతు సూర్యప్రకాశరావు, తలారి వెంకట్రావు, గెడ్డం శ్రీనివాసనాయుడు, పాముల రాజేశ్వరిదేవి, అంగూరి లక్ష్మీశివకుమారి, అసెంబ్లీ కో ఆర్డినేటర్లు ముద్రగడ గిరిబాబు, పిల్లి సూర్యప్రకాష్, పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మహిళా నేతలు రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మేడపాటి షర్మిలారెడ్డి, సుంకర శివప్రసన్న, జమ్మలమడక నాగమణి, పతివాడ నూక దుర్గారాణి, గాధంశెట్టి శ్రీదేవి, నేతలు సుంకర విద్యాసాగర్, అల్లి రాజబాబు, రాగిరెడ్డి బన్నీ, గండేపల్లి బాబీ, వాసిరెడ్డి జమీలు, చెల్లుబోయిన శ్రీనివాస్, గొల్లపల్లి డేవిడ్, మార్గాని గంగాధరరావు, పేరి శ్రీనివాసరావు, గుత్తుల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు



పల్లకీలో ఊరేగుతున్న విఘ్నేశ్వర స్వామివారు

అయినవిల్లి: సంకట హర చతుర్థి సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయం శుక్రవారం భక్తులతో పోటెత్తింది. స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. స్వామిని మాడ వీధుల్లో ఊరేగించారు. కోలాటం నిర్వహించారు. స్వామివారి పంచామృతాభిషేకాల్లో ముగ్గురు, లఘున్యాస అభిషేకాల్లో 109 మంది, గరికపూజలో ఒక జంట, ఉండ్రాళ్ల పూజలో తొమ్మిది మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 51 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. ఎనిమిది మందికి అక్షరభ్యాసాలు నిర్వహించారు. 2,500 మంది భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. స్వామివారికి మొత్తం రూ.2,58,178 ఆదాయం లభించిందని ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

న్యూస్‌రీల్

స్త్రీనిధి బ్యాంకు ఏజీఎం, మేనేజర్లకు పదోన్నతి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ – సెర్ప్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న స్త్రీనిధి మహిళా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) ఎం.ధర్మేంద్ర గుంటూరు జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం)గా పదోన్నతి పొందారు. అలాగే, మేనేజర్ ఎస్.శ్రీనుబాబు విశాఖ జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఏజీఎం)గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారిని బొమ్మూరు వైటీసీలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్త్రీనిధి బ్యాంకుకు వారు చేసిన సేవలను కొనియాడారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: జిల్లా పరిధిలో ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ కులాల అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సంక్షేమసాధికారత అధికారి పి.సత్యరమేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అమలాపురంలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. అభ్యర్థులు టెట్ పరీక్షలో అర్హత సాధించి ఉండాలన్నారు. వివరాలకు 70934 01225, 94404 03629 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సాంకేతికత వినియోగించాలి

అమలాపురం టౌన్: నేర పరిశోధనలో సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ కేసులను ఛేదించాలని ఎస్పీ బి.కృష్ణారావు పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రతీ కూడలిలో ప్రజా భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను ఆయన మాట్లాడారు. జిల్లా ఏఎస్పీ ఏవీఆర్ పీబీ ప్రసాద్‌తోపాటు రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు ఈ సమీక్షలో పాల్గొని నేర పరిశోధన పరంగా సాధించిన కేసుల వివరాలను వెల్లడించారు. పోలీస్ సబ్ డివిజన్, పోలీస్ సర్కిల్, పోలీసు స్టేషన్ల వారీగా నేర సమీక్షపై చర్చ జరిగింది. జిల్లాలో క్రైమ్ రేటు తగ్గించేలా పోలీసు విచారణలు, దర్యాప్తులు పకడ్బందీగా సాగాలని ఎస్పీ సూచించారు. ఇప్పటికే జిల్లాలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చాలా వరకూ సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయని, అయితే ఈ వ్యవస్థను మరింత విస్తరించాలన్నారు. నేర పరిశోధనలకు అనుసరించాల్సిన సాంకేతికతపై ఎస్పీ పలు సూచనలు ఇచ్చారు. చోరీలు, రికవరీలపై చర్చించారు.

'ముసుగు' రాజకీయం



గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన ఘాట్



రావుల చెరువు వద్ద ఏర్పాటు చేసిన పార్కు



నేమ్ బోర్డులకు వేసిన ముసుగులు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో 'ముసుగు' రాజకీయం నడుస్తోంది. సుమారు 300 ఏళ్ల చరిత్ర కలిగిన రావుల చెరువును గ్రామావిర్భావానికి ప్రధాన కారణంగా చెబుతారు. ఇంతటి ప్రధానమైన చెరువు కలుషితమైతే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రక్షాళన చేసి, ప్రజాహితంగా తీర్చిదిద్దారు. ఆ సమయంలో చెరువుకు పడమర వైపున చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేసి, దిగువన స్నానాదులకు అనువుగా ఉండేలా ఘాట్‌ను అభివృద్ధి చేశారు. వాటికి 'జక్కంపూడి ఘాట్, జక్కంపూడి పార్కు' అని పేర్లు పెట్టారు. అక్కడ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఫొటోలతో బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇది జరిగి మూడేళ్లు పైబడింది. అయితే, గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి పాలకులకు ఆ బోర్డులు నచ్చలేనట్టుంది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసినట్లు.. ప్రస్తుతం ఆ బోర్డులపై 'జక్కంపూడి' పేరు కనిపించకుండా ముసుగులు వేశారు. ఇది కాస్తా వివాదాస్పదమైంది. ఐదేళ్లు అధికారంలో ఉండాలని, ఓటర్లు ఓట్లు వేసి గెలిపించినప్పటికీ స్థానిక పాలకులకు 'జక్కంపూడి' అంటే భయం, ద్వేషం పోలేనట్టుందని, అందుకనే వాటికి ముసుగులు వేయించారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ బోర్డులకు వేసిన ముసుగులను తక్షణమే తొలగించాలని వైఎస్సార్ సీపీకి చెందిన ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, వార్డు సభ్యులు ప్రగడ చక్రి, ఉప్పల అనంతలక్ష్మి, మట్ట సత్యదేవి, అంకం సాయిబాబా, యక్కల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఎంపీడీఓ జేఏ ఝాన్సీకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

రత్నగిరిపై రద్దీ



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి శుక్రవారం రద్దీగా మారింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు. గురువారం రాత్రి, శుక్రవారం వేకువజామున రత్నగిరితో పాటు ఇతర ప్రాంతాల్లో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు, వారి బంధుమిత్రులకు సాధారణ భక్తులు కూడా తోడవడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వ్రతాలు 2,200 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. సత్యదేవుడు, అమ్మవారిని శనివారం ఉదయం 10 గంటలకు తిరుచ్చి వాహనంపై ఆలయ ప్రాకారంలో ఊరేగించనున్నారు.

అప్పులతో ఏపీ మరో పాకిస్తానే

- మెడలు వంచైనా హామీలు అమలు చేయిస్తాం
- ధాన్యం కొనుగోలులో సర్కార్ ఘోర వైఫల్యం
- పౌర సరఫరాల మంత్రి చెప్పేదంతా బూటకమే
- సమస్యలపై ప్రజాక్షేత్రంలోకి జగన్
- కాకినాడ సమీక్షలో రీజినల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ. చిత్రంలో పార్టీ నేతలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్ర ప్రభుత్వం అప్పుల మీద అప్పులు చేస్తోందని, ఈ లెక్కలు చూస్తుంటే ఏపీకి ఆర్థికంగా పాకిస్తాన్‌కు పట్టిన గతే పడుతుందని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. చెత్తతో కూడా సంపద సృష్టిస్తామని చెప్పి, ఆ చెత్తను తరలించే ట్రాక్టర్లను తీసేశారని, రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోవడం చంద్రబాబు ఘనతని ఆక్షేపించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పార్టీ అధ్యక్షులు, పీఏసీ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు, పార్లమెంటరీ పరిశీలకులు, ముఖ్య నేతలతో కాకినాడలో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా చెప్పుకోదగ్గ ఉత్పత్తి ఆధారంగా ఒక్క పని అయినా చేయగలిగారా అని నిలదీశారు. చంద్రబాబు హయాంలో మిగిల్చిన అప్పులతో కలిపి గడచిన ఐదేళ్లలో అప్పులు రూ.4.30 లక్షల కోట్లు మాత్రమే ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఏటా రూ.50 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్లు మాత్రమే అప్పులు పెరిగాయన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఏడాదిలోనే రూ.1.59 లక్షల కోట్ల అప్పులు చేసిన నిర్వాకం చంద్రబాబుకే చెల్లిందన్నారు. ఇంతా చేసి పేదల సంక్షేమానికి ఏమీ ఖర్చు చేయలేదని చేసిన కోట్ల రూపాయల అప్పు ఎవరి ఖాతాల్లోకి పోయాయో, ఎవరు దోపిడీ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అదే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ లేకుండా పేదలు, మధ్యతరగతి సంక్షేమం కోసం డీబీటీ ద్వారా నేరుగా వ్యక్తిగత ఖాతాలకు రూ.2.50 లక్షల కోట్లు జమ చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్నప్పుడు అప్పు చేసిన సొమ్ము పౌడర్లు, మేకప్‌లకు ఖర్చు చేశారని బొత్స ఎద్దేవా చేశారు. బాబు చెబుతున్నది చూస్తుంటే ఆయన చేతిలో అల్లా ఉద్దీన్ అద్భుత దీపం ఏమైనా ఉందా అనే అనుమానం కలుగుతోందన్నారు.

రైతుల ఇబ్బందులు పవన్‌కు పట్టవా?

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ ఘోర వైఫల్యం ప్రధానంగా గోదావరి జిల్లాల్లో స్పష్టంగా కనిపిస్తోందని బొత్స దుయ్యబట్టారు. కనీస మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొంటున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పేదంతా బూటకమన్నారు. గోదావరి ప్రాంతం నుంచి గెలుపొందిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రైతుల వద్దకు రాకపోవడం వారి దురదృష్టమని అన్నారు. ధాన్యం కొనే నాథుడు లేక గోదావరి జిల్లాల రైతులు నానా యాతనా పడుతూంటే పవన్ కల్యాణ్ ఒక్కసారైనా ఈ ప్రాంతంలో పరిస్థితిని పరిశీలించారా అని ప్రశ్నించారు. కోకో ధర కోసం అధికార పార్టీకి చెందిన దెందులూరు ఎమ్మెల్యే తదితరులు ఆందోళనకు దిగడం రాష్ట్రంలోని పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పొగాకు, ఆక్వా రైతుల ఇబ్బందులపై పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. గత ఎన్నికల సందర్భంగా మరో రెండు హామీలివ్వాలని తామంతా ఒత్తిడి తెచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి చేయగలిగిందే చెబుదామన్నారని, చంద్రబాబు మాదిరిగా అధికారం కోసం ఎడాపెడా హామీలు గుప్పించ లేదని బొత్స చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ సహా అన్ని హామీలనూ ప్రభుత్వ మెడలు వంచైనా సరే అమలు చేసేలా వైఎస్సార్ సీపీ ఒత్తిడి తెస్తుందని అన్నారు. ఎవరి దయాదాక్షిణ్యాలపై ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తమ పార్టీకి ప్రజలిచ్చిన 40 శాతం ఓటింగ్ చిన్న విషయం కాదన్నారు. ప్రజల తరఫున పోరాడేందుకు ప్రజలే వైఎస్సార్ సీపీకి రెండంకెల ఓటింగ్ ఇచ్చారన్నారు.

సమస్యలపై ఆందోళనలు

సమస్యలపై పార్టీ స్థానిక నాయకత్వం ఎక్కడికక్కడ ఆందోళనలకు సిద్ధమవుతోందని బొత్స చెప్పారు. ప్రధానమైన పొగాకు, ధాన్యం, ఆక్వా రైతుల సమస్యలపై వారికి అండగా నిలిచేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుని జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో క్షేత్ర స్థాయికి వస్తారని తెలిపారు. పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా జూన్‌లో మండల, జూలై నెలాఖరుకు గ్రామ కమిటీల నియామకాలు పూర్తి చేయాలని కాకినాడ సమీక్షలో తీర్మానించినట్లు చెప్పారు. జూన్ 1 నుంచి ప్రతి 10 రోజులకు ఒక జిల్లాలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని బొత్స వెల్లడించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, వంకా రవీంద్ర, బొమ్మి ఇజ్రాయిల్, పండుల రవీంద్రబాబు, అనంత ఉదయ్ భాస్కర్, కుడుపూడి సూర్యనారాయణరావు, **పార్టీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం, ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ఉమ్మడి తూర్పు గోదావరి జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పార్టీ జిల్లాల అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీని**వాస వేణుగోపాలకృష్ణ (తూర్పు గోదావరి), దాడిశెట్టి రాజా (కాకినాడ), చిర్ల జగ్గిరెడ్డి (కోనసీమ), పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ మంత్రులు తానేటి వనిత, పినిపే విశ్వరూప్, తోట నరసింహం, కారుమూరి నాగేశ్వరరావు, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎంపీలు వంగా గీత, చింతా అనురాధ, మార్గాని భరత్‌రామ్, కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాదరాజు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, దూలం నాగేశ్వరరావు, పొన్నాడ సతీష్‌కుమార్, తలారి వెంకట్రావు, గెద్దం శ్రీనివాసనాయుడు, రౌతు సూర్యప్రకాశరావు, పాముల రాజేశ్వరిదేవి, పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

మద్యం విధానంపై వేధిస్తున్నారు

మద్యం కుంభకోణం పేరుతో కొందరిని టార్గెట్ చేసి వేధిస్తూ, అప్రతిష్టపాల్జేస్తున్నారనే విషయం రాష్ట్ర ప్రజలకు తెలియంది కాదన్నారు. మద్యం వ్యవహారంలో నిష్పక్షపాత విచారణను స్వాగతిస్తామని, కావాలని అన్యాయంగా కేసులు పెడుతూ పోతారా అని నిలదీశారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని తీర ప్రాంతంలో హార్బర్లు, వైద్య కళాశాలలు, ఉద్దానంలో కిడ్నీ ఆస్పత్రి, భోగాపురంలో అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయం వంటి ఉత్పత్తి, ఉపాధి ఆధారంగా పెట్టుబడులు పెట్టామని వివరించారు.

క్లుప్తంగా

ఆకుట్టుకొనేలా..


గుడిమెళ్లంకలో వింత ఆకారంలో బీర ఆకు

మలికిపురం: ఊసరవెల్లిగా మారిన తొండా కాదు, పురుగూ కాదు. ఆదమరిచి చూస్తే అలాగే ఉన్న ఈ ఆకారం బీర ఆకు ...మలికిపురం మండలంలోని గుడిమెళ్లంక గ్రామంలో జిల్లెళ్ళ నరసింహరావు పెంచిన బీర పాదుకు వచ్చిన ఆకు ఇలా వింతగా ఉంది..

26 వరకు సర్టిఫికెట్ల పరిశీలన

బాలాజీచెరువు (కాకినాడ సిటీ)/రాయవరం: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 26వ తేదీగా సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలని కాకినాడ ఐటీఐ ప్రిన్సిపాల్ జీ.వీ.కే వర్మ శుక్రవారం తెలిపారు. రెండు జిల్లాలో కలిపి 555మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకూ 118మంది మాత్రమే వెరిఫికేషన్ చేయించుకున్నారని తెలిపారు. సమీపంలో గల ఐటీఐ లేదా అమలాపురం ఉపాధి కార్యాలయంలో వెరిఫికేషన్ చేయించుకోవచ్చని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే 94404 08182 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

ట్రాఫిక్ మళ్లింపు

కాకినాడ సిటీ: సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు నిర్మిస్తున్న భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణపు పనుల్లో భాగంగా బ్రిడ్జిలకు గడ్డర్లు లేపుతున్న నేపథ్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపునకు వచ్చే కెనాల్ రోడ్డు రహదారిలో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సామర్లకోట రోడ్డు ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ పనులకు నాలుగు రోజులు ట్రాఫిక్ నిలుపుదల చేశామని కలెక్టర్ తెలిపారు. అచ్చంపేట నుంచి సామర్లకోట వరకు జరుగుతున్న రహదారి పనుల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్‌లో గడ్డర్లు లేపుతున్నందున ఈనెల 27, 28 తేదీల్లో రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు రెండు రోజులు ట్రాఫిక్ మళ్లిస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, వాహనదారులు గమనించాలని సూచించారు.

వ్యక్తి మృతి


కుడిపూడి శ్రీను (ఫైల్)

ఆలమూరు: మండలంలోని జొన్నాడ గౌతమీ గోదావరి తీరంలో శుక్రవారం కుడుపూడి శ్రీను (39) అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఆలమూరు ఏఎస్ఐ ఆర్.సూర్యచంద్రరావు కథనం ప్రకారం రావులపాలెంకు చెందిన శ్రీను మృతదేహం ఏటిగట్టు దిగువన పడి ఉంది. దీనిపై స్థానికుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై సూర్యచంద్రరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు రెండు రోజుల క్రితమే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడు శ్రీను పొరపాటున జారిపడ్డాడా లేదా నేరపూరిత కుట్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు మృతుడి తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసును నమోదు చేశారు.

సివిల్స్ చదవడమే లక్ష్యం

జిల్లా 8వ ర్యాంకర్ స్పందన


ఏపీ ఈసెట్ 8వ ర్యాంకర్ మోహిని

మామిడికుదురు: బీటెక్ పూర్తి చేసి సివిల్స్ చదవాలన్నదే తన లక్ష్యమని ఏపీ ఈసెట్‌లో కోనసీమ జిల్లా స్థాయిలో 8వ ర్యాంకు సాధించిన మొగలికుదురు గ్రామానికి చెందిన గోగి మోహిని స్పందన శుక్రవారం తెలిపింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన స్పందన బీఎస్సీ మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రతిభ చూపింది. తండ్రి సత్యనారాయణ రైతు, తల్లి వెంకటలక్ష్మి గృహిణి. పేరెంట్స్ ప్రోత్సాహంతో తాను చదువుకున్నానని తెలిపింది. ఏపీ ఈసెట్‌లో ప్రతిభ చూపిన మోహిని స్పందనను స్థానికులు అభినందించారు.

వ్యవసాయ శాస్త్రవేత్తనవుతా..


స్టేట్ 9వ ర్యాంకర్ సాయిమణిరత్నం

మామిడికుదురు: ఏపీ ఈసెట్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌లో ఆదుర్రు గ్రామానికి చెందిన గుబ్బల సాయిమణిరత్నం రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించాడు. తాను వ్యవసాయ శాస్త్రవేత్తగా గుర్తింపు పొందాలని కోరుకుంటున్నానని అన్నాడు. శాస్త్రవేత్తగా రైతులకు మేలైన యంత్ర పరికరాలను తయారు చేసి, మంచి దిగుబడులు సాధించేలా కృషి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. సాయిమణిరత్నం తండ్రి లక్ష్మణరావు, తల్లి శ్యామలాదేవి దంపతులు రైతు కుటుంబానికి చెందిన వారు. సాయిమణిరత్నంను స్థానికులు శుక్రవారం అభినందించారు.

మంచి ఆర్కిటెక్ట్‌గా స్థిరపడతా..

28వ ర్యాంకర్ యజ్ఞేశ్వరి

అమలాపురం టౌన్: ఏపీ ఈ సెట్ ఫలితాల్లో అమలాపురానికి చెందిన పితాని యజ్ఞేశ్వరి రాష్ట్ర స్థాయిలో 28వ ర్యాంక్ సాధించింది. ఆమె సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఈ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. ఆమె అమలాపురం ఆరు నెలలుగా పీఆర్ ప్రాజెక్ట్స్ విభాగంలో ఇండస్ట్రియల్ ట్రైనింగ్ తీసుకుంటోంది. ఈమె తండ్రి వెంకటరమణ వడ్రంగి మేస్త్రిగా పనిచేస్తున్నారు. భవిష్యత్‌లో మంచి ఆర్కిటెక్ట్‌గా స్థిరపడాలన్నది తన లక్ష్యమని ఆమె పేర్కొంది. అమలాపురం పంచాయతీరాజ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అభినందన సభలో యజ్ఞేశ్వరిని ఈఈ పులి రామకృష్ణారెడ్డి, డీఈఈ అన్యం రాంబాబు ప్రశంసించారు.


8వ ర్యాంక్ సాధించిన యజ్ఞేశ్వరిని అభినందిస్తున్న పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి, డీఈఈ రాంబాబు తదితరులు

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

రూ.6,50,000 విలువైన వస్తువుల రికవరీ


బూరుగుపూడి సెంటర్‌లో దాచిన వస్తువులను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కోరుకొండ: మండలంలోని దోసకాయలపల్లిలో ఈ నెల 11వ తేదీన చోరీకి గురయిన రోవర్ మెషీన్, ల్యాబ్, లైటర్లను శుక్రవారం రికవరీ చేసినట్టు కోరుకొండ సీఐ సత్యకిషోర్ తెలిపారు. సర్వేయరు నాగేంద్ర రూ.6,50,000 విలువైన రోవర్ మెషీన్, ట్యాబ్, లైటర్లను దోసకాయలపల్లి సెంటర్‌లోని కిరాణాషాపులో చార్జింగ్ కోసం ఉంచాడు. తెల్లవారు దుకాణం తెరిచేటప్పటికే చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారమివ్వగా, సీఐ సత్యకిషోర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. రాజమహేంద్రవరం బాలాజీపేటకు చెందిన రవివర్మ, అతని తమ్ముడు, క్వారి మార్కెట్ సెంటర్‌కు చెందిన యేసును పట్టుకున్నారు. వారి నుంచి వస్తువులను స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశారు.

ట్రక్కు దొంగిలించిన వ్యక్తికి రిమాండ్

సీతానగరం: మండలంలోని చినకొండేపూడికి గెద్దం రామకృష్ణకు చెందిన ట్రాక్టర్ ట్రక్కు దొంగిలించిన సీతానగరం వెలమపేటకు చెందిన కన్నూరి ముత్యాలుకు కోర్టు రిమాండ్ విధించిందని, రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించామని ఎస్సై డి.రామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. చినకొండేపూడికి చెందిన గెద్దం రామకృష్ణకు చెందిన ట్రాక్టర్ ట్రక్కు మూడు నెలల క్రితం చోరీ అయింది. ఈ నెల 13న సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ముత్యాలు తన సొంత ట్రాక్టర్‌తో పాటుగా దొంగిలించిన ట్రక్కును గోకవరంలో ఒక వ్యక్తికి నెలకు రూ.12 వేలకు అద్దెకు ఇచ్చాడు. ఒక నెల అద్దె సక్రమంగా ఇచ్చి, రెండవ నెల అద్దె ఇవ్వకపోవడంతో గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తనకు అద్దె చెల్లించడం లేదని, అద్దె డబ్బులు ఇప్పించాలని ముత్యాలు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రామ్‌కుమార్ గోకవరం శివారున 2 లక్షల విలువ గల ట్రక్కును స్వాధీనం చేసుకుని, రాపాక కల్వర్టు వద్ద ముత్యాలును అదుపులోకి తీసుకున్నారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ముత్యాలును సెంట్రల్ జైల్‌కు తరలించామని తెలిపారు.

ఇద్దరు మహిళా దొంగల అరెస్ట్

60 గ్రాముల బంగారం, రూ.1.50 లక్షల నగదు స్వాధీనం


విలేకరుల సమావేశంలో పాల్గొన్న సీఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబు, అడిషనల్ ఎస్ఐ ప్రసాద్

అన్నవరం: ఆర్టీసీ బస్టాండ్‌లలో ప్రయాణికులను మాటలతో మభ్యపెట్టి వారి బ్యాగుల్లో గల విలువైన ఆభరణాలు, నగదు అపహరిస్తున్న ఇద్దరు మహిళా దొంగలను శుక్రవారం స్థానిక బస్ కాంప్లెక్స్ వద్ద అరెస్ట్ చేసినట్టు ప్రత్తిపాడు సీఐ బీ సూర్య అప్పారావు తెలిపారు. అన్నవరం, ప్రత్తిపాడు బస్‌స్టేషన్ల వద్ద తమ బంగారు వస్తువులు దొంగలు అపహరించారని మహిళలు ఆయా పోలీస్‌స్టేషన్‌లలో కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. బస్టాండ్‌ల వద్ద నిఘా పెట్టారు. శుక్రవారం అన్నవరం బస్ కాంప్లెక్స్ వద్ద దొంగతనం చేస్తున్న ఇద్దరు మహిళా దొంగలను పోలీసులు పట్టుకున్నారు. వీరిని ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన నక్కా వెంకటలక్ష్మి, రామవరప్పాడుకు చెందిన నక్కా మంగగా గుర్తించారు. వీరి వద్ద నుంచి 60 గ్రాముల బంగారం, రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. సమావేశంలో అన్నవరం ఎస్ఐ శ్రీహరి బాబు, అడిషనల్ ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

కేదార్‌నాథ్ యాత్రలో రోటరీ క్లబ్ సభ్యుడి మృతి


శ్రీరంగ కృష్ణ బదిరి (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: ఉత్తరాంచల్‌లోని కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లిన రాజమహేంద్రవరానికి చెందిన రోటరీ క్లబ్ ఐకాన్ సభ్యుడు బిలిసెట్టి శ్రీరంగ కృష్ణ బదరి(33) బుధవారం కేదార్‌నాథ్‌లో మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం ఢిల్లీ నుంచి హైదరాబాద్ మీదుగా శుక్రవారం మృతదేహాన్ని నగరంలోని కంబాలసత్రం సమీపంలోని కృష్ణ బదరి నివాసానికి తీసుకువచ్చారు. కృష్ణ బదరికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ చార్టర్ ప్రెసిడెంట్ తీగల రాజా, క్లబ్ అధ్యక్షుడు యిమ్మన్ని వెంకట్, క్లబ్ సభ్యులు మృతదేహానికి నివాళులు అర్పించారు. తీగల రాజా మాట్లాడుతూ చిన్న వయసులోనే సమాజ శ్రేయస్సుకు శ్రద్ధగా పనిచేసే క్లబ్ సభ్యుడు అకాల మరణం సమాజానికి తీరని లోటు అన్నారు. కృష్ణ బదరి అంత్యక్రియలను ఇన్నీసుపేట రోటరీ కైలాస భూమిలో నిర్వహించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


కడియం - రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ల మధ్య స్వాధీనం చేసుకున్న మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ: కడియం - రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ల మధ్య రైలునుంచి జారి పడి సుమారు 50 ఏళ్ల వయసుగల వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై మావుళ్లు తెలిపారు. గాయపడి ఉండగా శుక్రవారం తెల్లవారుజామున గుర్తించి 108 అంబులెన్సు ద్వారా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడు నలుపు రంగుపై పసుపు రంగు గడులు గల హాఫ్ హాండ్స్ షర్ట్, నీలం రంగు లుంగీ ధరించాడు. మృతుడి కుడి చేయి మీద సన్ ఫ్లవర్ గుర్తుతో పచ్చబొట్టు ఉందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94406 27551, 94910 03239 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు : చాగల్లు -నిడదవోలు రైల్వేస్టేషన్ మధ్యలో శుక్రవారం విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న రైలు నుంచి జారిపడి 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడు నలుపు, సిమెంటు రంగు నెక్ బనియన్, నీలం రంగు ప్యాంట్ ధరించాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసినవారు 94906 17090, 99480 10061 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై అప్పారావు తెలిపారు.

వడగాడ్పులకు వృద్ధుడి మృతి


మృతుడు ప్రసాదరావు (ఫైల్)

నల్లజర్ల: మండలంలోని గంటావారిగూడెం అంబేడ్కర్ కాలనీలో దొబ్బిడి ప్రసాదరావు (70) వడగాడ్పులకు మృతిచెందారు. ఆయన కుమారుడు సందీప్ అందించిన వివరాల ప్రకారం మూడు రోజులుగా వీస్తున్న వడగాల్పులకు ఆయన మృతిచెందారు. ఈ విషయం రెవెన్యూ ,గ్రామపంచాయితీ అధికారులకు తెలియజేసినట్టు చెప్పారు.


సారా కేసుల్లో నిందితుల బైండోవర్

కొత్తపేట: ఆత్రేయపురం మండల పరిధిలోని పలు గ్రామాల్లో సారా కేసుల్లో నమోదైన నిందితులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కొత్తపేట సీఐ కే కాత్యాయని తెలిపారు. ఆత్రేయపురం మండలంలో పేరవరం, రాజవరం, వెలిచేరును సారా రహిత గ్రామాలుగా మార్చే కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా దాడులు నిర్వహించి నాటుసారా తయారీకి మూలమైన బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేయడం, నాటు సారా తయారీ, విక్రయాలను, రవాణాను అరికట్టడం, సారా స్వాధీనం చేసుకోవడం ద్వారా కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఆయా కేసుల్లో నమోదైన 12 మందిని ఎక్సైజ్ ఎస్సై కే అన్నవరం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు ముందు బైండోవర్ చేశారు.

ఆకతాయిలకు వినూత్న శిక్ష

ఆలమూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ గందరగోళ పరిస్థితులు సృష్టించిన పోకిరీలకు ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వినూత్నమైన శిక్షను విధించింది. కోర్టు అధికారుల కథనం ప్రకారం మండపేటలో గురువారం రాత్రి మెయిన్‌రోడ్డుపై విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్న పది మందిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారందరినీ శుక్రవారం స్థానిక జూని యర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పర్చగా నిందితులందరికీ రూ.100 జరిమానా విధించారు. దీంతో పా టు పరిసరాలను పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. దీంతో పోలీసు సిబ్బంది సమీపంలోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని నిందితులతో శుభ్రం చేయించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

డీఎస్సీ-2025 దరఖాస్తుల లెక్క తేలింది

ఉమ్మడి తూర్పు గోదావరిలో 38,617

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డీఎస్సీ-2025కు 38,617 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత నెల 20న డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసిన విషయం విదితమే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,241 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. గత నెల 20 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కలిపి 63,004 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల్లో 14,380 మంది పురుష అభ్యర్థులు ఉండగా, 24,237 మంది మహిళా అభ్యర్థులున్నారు. ఓసీ కేటగిరీ నుంచి 5,120, బీసీ-ఎ కేటగిరీ నుంచి 2,810, బీసీ-బి కేటగిరీ నుంచి 6,991, బీసీ-సి కేటగిరీ నుంచి 554, బీసీ-డి కేటగిరీ నుంచి 3,636, బీసీ-ఇ కేటగిరీ నుంచి 568 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ కేటగిరీలో గ్రూపు-1 నుంచి 87, గ్రూపు-2 నుంచి 2,572, గ్రూపు-3 నుంచి 10,066 దరఖాస్తులు రాగా, ఎస్టీ కేటగిరీ నుంచి 6,213, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ నుంచి 3,782 దరఖాస్తులు వచ్చాయి. పీహెచ్ కేటగిరీలో వీహెచ్ సబ్ కేటగిరీ నుంచి 159, హెచ్‌హెచ్ సబ్ కేటగిరీ నుంచి 36, ఓహెచ్ సబ్ కేటగిరీలో 847, ఎంఐ సబ్ కేటగిరిలో ఆరు దరఖాస్తులు వచ్చాయి.

ఇద్దరు ఇన్విజిలేటర్లపై వేటు

అన్నవరం: స్థానిక శ్రీ సత్యదేవ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తున్న అదే కళాశాలకు చెందిన జూనియర్ లెక్చరర్లు మోకిన కొండబాబు, జి.కృష్ణవేణి తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదని ఇంటర్మీడియెట్ పరీక్షల ఫ్లయింగ్ స్క్వాడ్ శుక్రవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో వెల్లడైంది. వీరు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తున్న తరగతి గదులలో ఆయా పరీక్షలకు సంబంధించి గైడ్లు, ఇతర మెటీరియల్ ఉండడాన్ని గమనించారు. వీరు నియమ నిబంధనలను పాటించనందున విధుల నుంచి రిలీవ్ చేయాలని కాకినాడ జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు పరీక్షల కమిటీకి నివేదిక సమర్పించినట్లు అధికారులు తెలిపారు. వారి నుంచి సంజాయిషీ కోరాలని కూడా ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అంబాజీపేట: ముక్కామల ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వక్కలంకకు చెందిన పిల్లి సతీష్ ఈ నెల 15న తన స్కూటీపై ముక్కామల నుంచి ఇంటికి వెళుతుండగా ఆర్టీసీ బస్సును తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టాడన్నారు. దీంతో సతీష్‌కు తీవ్రగాయాలు కాగా అమలాపురం ఆస్పత్రికి తరలించారన్నారు. క్షతగాత్రుడి సమీప బంధువు కొప్పిశెట్టి లక్ష్మీసాయిరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
శనివారం ॥ 17-5-2025





హైదరాబాద్ లో జరిగే 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ లో చెక్ రిపబ్లిక్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది అడెలా స్ట్రొఫెకోవా. 21 ఏళ్ల ఈ బ్యూటీ మోడల్, ఫిట్నెస్ ట్రైనర్, ఈవెంట్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తోంది. కనెక్టింగ్ హార్ట్స్ అక్రాస్ జనరేషన్స్ పేరుతో రెండు, మూడు తరాల వారిని ఒకచోట చేర్చడం, ప్రేమ, దయ, స్నేహపూరిత వాతావరణాన్ని వ్యాప్తి చేయడంపై దృష్టి పెడుతుంది. 'ఏదైనా సాధించాలనుకోవడానికి ముందు తమకు నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం ముఖ్యం' అంటూ తన గురించి తెలియజేసింది.

మనల్ని మనం తెలుసుకోవడమే..

''అందాల కిరీటం అనేది ఒక ఏడాది వరకే. కానీ, చాలామందితో కనెక్ట్ అవ్వచ్చు. నా కల ఒక్కటే! మిస్ వరల్డ్‌గా నన్ను నేను చూసుకోవాలి. నా చిన్నప్పటి నుంచే ఈ ఆలోచన ఉండేది. మా అమ్మ మేకప్ వస్తువులన్నీ నేనే వాడేసేదాన్ని. అమ్మ డ్రెస్సులు, హీల్స్ వేసుకొని ఇంట్లో తిరిగేదాన్ని. పదిహేనేళ్ల వయసు నుంచి అందాల పోటీలలో పాల్గొంటూ వచ్చాను. పదిహేడేళ్ల వయసులో మొదటి సారి ప్రపంచ పోటీలో పాల్గొన్నాను.

విజయసాధనకు..

బ్యూటీ కాంటెస్ట్‌లో చాలా ఛాలెంజెస్ ఉంటాయి. వివిధ రంగాలలో మమ్మల్ని పరీక్షిస్తారు. వాటిలో పాల్గొన్నప్పుడు కొంత ఆందోళనగా కూడా ఉంటుంది. కానీ, నన్ను నేను నిరూపించుకోవడానికి ముఖ్యమైన సమయం అదే. మిస్ బ్యూటీ కావాలని కలలు కనే యువతులు అనుకరించడం కాదు. ముందు తామేం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకోవడం ముఖ్యం. నిజంగా ఏదైనా కోరుకుంటే 200 శాతం ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధించగలం. ఒక్క మిస్ విషయమే కాదు నేను ఏదైనా కోరుకున్నప్పుడు విజయం కోసం నా వంతుగా మొత్తం ప్రాణం పెట్టేస్తాను. అలాగే, విజయాలూ సాధించాను. కోరుకున్నది పొందాలంటే సరైన సమయం, శక్తి, దృష్టి పెడితే అదే మనకు అదృష్టంగా మారుతుంది. అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

> అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

ఫిట్‌నెస్ ట్రైనర్

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. స్విమ్, రన్నింగ్, హార్స్ రైడింగ్ చేస్తాను. మోడలింగ్ నా కెరియర్. జీవనాధారం కూడా అదే. ఫిట్‌నెస్ ట్రైనర్‌గా కోచింగ్ ఇస్తాను. ఆ సమయంలో చాలా ఆనందిస్తాను. ఫిట్‌నెస్ గురించి నేను చెప్పే విషయాలు వినడమే కాదు, వాళ్లు ఆచరణలో పెడతారు. ఓ గొప్ప సమాజమే నాతో పాటు ఉందనిపిస్తుంది. వారితో నా అనుభవాలను పంచుకోవడం కూడా నాకు చాలా ఇష్టం. వారానికి కనీసం రెండుసార్లు ఫిట్‌నెస్ గ్రూప్‌లకు కోచ్‌గా పనిచేస్తాను.

నాకు ప్రస్తుతం ఉన్న క్షణం చాలా ముఖ్యమైనది. అందుకే ఈ క్షణంలో మాత్రమే జీవిస్తాను. సాధ్యమైనంత వరకు ప్రపంచాన్ని తెలుసుకోవాలి అనుకుంటాను.

ఫ్యాషన్ గురించి

ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తను ధరించే దుస్తుల ద్వారానే వ్యక్తపరచగలడు. మేం చెక్ రిపబ్లిక్‌లో స్థిరపడినా వివిధ దేశాలకు సంబంధించిన దుస్తుల్లో నన్ను నేను చూసుకుంటాను'' అని వివరించారీ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

అడెలా స్ట్రొఫెకోవా: చెక్ రిపబ్లిక్

● సంకల్ప బలం

వెయిట్ లిఫ్టర్ బామ్మ @70

వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌కి రెడీ

అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో జిమ్‌లోకి అడుగు పెట్టిన రోషిణి... ఇప్పుడు ఎన్నో వ్యాయామాలలో ఆరి తేరింది. వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. అమెరికాలో జరగబోయే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'లో పాల్గొనడానికి రెడీ అవుతోంది 70 సంవత్సరాల రోషిణి.

కుమారుడితో కలిసి ఢిల్లీలో ఉంటున్న రోషిణికి ఎడమ కాలి మోకాలినొప్పి మొదలైంది. మెట్లు ఎక్కడం, నడవడం కష్టంగా మారింది. ఆమె ఎడమ మోకాలికి ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించారు. కుడి చూపుడు వేలు బలహీన పడింది.

ఫిజియో థెరపీ మొదలు పెట్టింది.

'ఈ టైమ్‌లో అమ్మకు జిమ్ అవసరం ఉంది' అనుకున్నాడు ఆమె కుమారుడు, ఫిట్‌నెస్ కోచ్ అయిన అజయ్.

68 సంవత్సరాల వయసులో తొలి సారిగా జిమ్‌లోకి అడుగు పెట్టింది రోషిణి.

మెల్ల మెల్లగా ఆమెకు సాంత్వన చేకూరింది.

స్ట్రెచ్చింగ్, మూమెంట్ ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టి వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది. రెగ్యులర్ ట్రైనింగ్ వల్ల చేయి బలపడింది. రోజువారీ పనులు కష్టంగా అనిపించేవి కాదు.

జిమ్ ఉత్సాహం ఆమెను వెయిట్ లిఫ్టింగ్ వైపు తీసుకువచ్చింది.

ఇప్పుడు రోషిణి ట్రాప్‌బార్ డెడ్‌లిఫ్ట్‌లో 97 కేజీల బరువు ఎత్తుతుంది.

80 కేజీల కన్వెన్షల్ డెడ్‌లిఫ్ట్ చేస్తుంది.

50 కేజీల స్క్వాట్స్ చేస్తుంది.

120 కేజీల లెగ్ ప్రెస్ చేస్తుంది.

4 నిమిషాల పాటు ప్లాంక్ పట్టుకోగలదు.

ప్రతిరోజూ రెండు గంటలు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో చేస్తుంది.

'దువ్వెన పట్టుకోవడం కూడా కష్టమే అని ఒకప్పుడు డాక్టర్లు అమ్మ గురించి చెప్పారు' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అజయ్. జిమ్‌లో వర్కవుట్స్ పుణ్యమా అని ఇప్పుడు రోషిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. వారు ఆమెను ప్రేమగా 'వెయిట్‌లిఫ్టర్ మమ్మీ' అని పిలుచుకుంటారు.

డైట్ విషయానికి వస్తే...

'ఎలాంటి రిస్ట్రిక్షన్‌లు లేవు. నాకు దహీ బల్లే అంటే చాలా ఇష్టం. అలా అని అదేపనిగా తినను. అప్పుడప్పుడు మాత్రమే తింటాను. ఏదైనా ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు' అంటుంది ఇంటి భోజనాన్ని ఇష్టపడే రోషిణి.

వచ్చే సంవత్సరం అమెరికాలో జరిగే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'కి ఆమెకు ఆహ్వానం అందింది.

ప్రస్తుతం రోషిణి ఆ ఈవెంట్ కోసం ప్రాక్టీస్ చేస్తోంది.

'ఒకప్పుడు నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు మాత్రం బయటికి వెళుతున్నాను. రకరకాల కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది' అంటుంది రోషిణి.

'సీనియర్ సిటిజన్స్ జిమ్‌లో వ్యాయామాలు చేసినప్పుడు అది వాళ్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. వారి నుంచి యువతరానికి సందేశం అందుతుంది' అంటున్నాడు అజయ్.



● అజయ్, రోషిణి



స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా...

అమ్మాయిలకు చదువు కాదుకదా.. కనీసం వ్యక్తిగత శుభ్రత పాటించే వెసులుబాటు కూడా లేని చోట అందాల పోటీలంటే ఆనందంగా సాగనంపుతారా? పంపరు! అయోమ్ టీటో మతీజ్‌కు కూడా తీవ్ర నిరసన ఎదురైంది! అయినా వెనకడుగు వేయకుండా అందాల పోటీలకు అటెండ్ అయింది..

మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...



''లా చదివాను. లీగల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సౌత్ సుడాన్‌లో పుట్టాను. కానీ అక్కడి రాజకీయ అనిశ్చితి వల్ల మా అమ్మ మమ్మల్ని తీసుకుని కెనడాకు వలస వచ్చేసింది. అందుకే నేను అక్కడే పెరిగాను. మా నాన్న, ఆయన తరపు, అమ్మ తరపు బంధువులంతా సౌత్ సుడాన్‌లోనే ఉండిపోయారు. మా అమ్మ కెనడాలో టీచర్‌గా ట్రెన్ అయ్యి, మా సొంత దేశంలోని పిల్లలకు మంచి స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి తిరిగి సుడాన్ వచ్చేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత 2019లో నేను మా కుటుంబాన్ని చూడ్డానికి నా సొంత దేశానికి వెళ్లాను. ఎమోషనలే కాదు.. కొంచెం షాక్ కూడా అయ్యాను. కెనడాలో నేను ఆస్వాదించిన జీవితం, సౌత్ సుడాన్‌లో మా వాళ్లంతా అనుభవిస్తున్న జీవితాన్ని బేరీజు వేసుకుని. అప్పుడే డిసైడ్ చేసుకున్నాను నా దేశ ప్రజలకూ ఉన్నత ప్రమాణాల జీవితం అందేలా కృషి చేయాలని! కోవిడ్ తర్వాత వచ్చేశాను. సర్వీస్ మొదలుపెట్టాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే!

అందాల పోటీలకు వ్యతిరేకం

అందాల పోటీల పట్ల సౌత్ సుడాన్‌లో చాలా వ్యతిరేకత ఉంది. నేను మిస్ సౌత్ సుడాన్ పాజెంట్‌లో పాల్గొంటున్నప్పుడు, ఇప్పుడు కూడా నిరసన ఎదురైంది. కానీ నా దృష్టిలో ఈ పోటీలు స్కిన్ షో కాదు. వైవిధ్యమైన సంస్కృతులు, భాషలు, జీవనశైలులను పరిశీలించే, అధ్యయనం చేసే అవకాశాన్నిచ్చే వేదిక. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సర్దుబాటు, సహనాన్ని నేర్పిస్తుంది. ఇవన్నీ కూడా నా సామాజిక బాధ్యతను మెరుగ్గా నిర్వర్తించేందుకు తోడ్పడతాయి. అందుకే నిరసనను ఎదుర్కొని మరీ ఈ పోటీకి వచ్చాను. అంతేకాదు ఈ పోటీలు ఒకరినొకరు తెలుసుకుని, అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయం అందించుకునే స్ఫూర్తినీ పంచుతాయి. మహిళలకు అలాంటి స్ఫూర్తి, ప్రేరణ అవసరం. దానికి అందాల పోటీలే కావాలా అంటారేమో! స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడి ప్రపంచ వ్యాప్తంగా పాతుకుపోయి.. అది స్త్రీల సహజ లక్షణమనే అభిప్రాయమూ అంతే లోతుగా నాటుకుపోయింది. దాన్ని అబద్ధమని నిరూపిస్తున్నాయి ఈ పోటీలు! కొన్ని దేశాల పేర్లే తెలియవు నేనీ కంటెస్ట్‌కి వచ్చేదాకా! అందుకే పట్టుబట్టి మరీ ఈ పోటీకి వచ్చాను. ఇక్కడి వైవిధ్యత, ఆధ్యాత్మికత నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి. ఈ దేశంలోని వాళ్లను చూస్తే నాకు ఫారినర్స్‌గా అనిపించరు. మా వాళ్లలాగే అనిపిస్తారు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయి.. ఇప్పుడు కలుసుకుంటున్నామేమో అనిపిస్తోంది! తెలంగాణ గురించి చెప్పుకోవాల్సి వస్తే ఇక్కడి ఎడ్యుకేషన్, మెడికల్ కేర్ గురించి కచ్చితంగా మాట్లాడుకోవాలి. ప్రపంచ ప్రమాణాలతో పోటీపడుతున్నాయి. సౌత్ సుడాన్ యువత తమ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కే వస్తోంది. మా దేశంలోని చాలామంది ప్రజలు ఆరోగ్య అవసరాల కోసం ఇక్కడి హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.

బాల్య వివాహాలు.. బలవంతపు పెళ్లిళ్లు

ప్రపంచంలోని అనేక దేశాల్లాగే సౌత్ సుడాన్‌లోనూ పురుషాధిపత్యమే! కొడుకుకే ప్రాధాన్యం. అమ్మాయికి వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ ఆర్థికపరమైన వెసులుబాటు ఉండదు. బాల్యవివాహాలు, బలంతపు పెళ్లిళ్లు కామన్. ఇక చదువుకునే అవకాశమెక్కడిది? నేను ఇక్కడిదాకా రాగలిగాను అంటే మా అమ్మే కారణం. మమ్మల్ని ఆమె కెనడా గనుక తీసుకు వెళ్లకపోయుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో (ఈ మాట చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు). నాకింకా గుర్తు.. ఆమె లగేజ్ సర్దుతుంటే 'మనం ఎక్కడికి వెళ్తున్నాం?' అని అడిగాను. 'మీరు స్వేచ్ఛగా మీకు నచ్చింది చదువుకునే చాన్స్ ఉన్న చోటికి' అని చెప్పింది! మేం నలుగురు అక్కచెల్లెళ్లం. మాకొక తమ్ముడు. అందరినీ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది అమ్మ. ఎలాంటి అవకాశాల కోసం అమ్మ మమ్మల్ని కెనడాకు తీసుకెళ్లిందో అలాంటి అవకాశాలనే సౌత్ సుడాన్‌లోని అమ్మాయిలకూ కల్పిస్తోంది తాను నడిపిస్తున్న స్కూల్ ద్వారా! ఆమె చేస్తున్న ఆ సర్వీస్‌కి నేనూ శాయశక్తుల సాయపడుతున్నాను. మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్ల కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి. సాధికారతకు, సామాజిక బాధ్యతకు ఐకాన్స్‌గా ఉండి, తర్వాత తరాలను ఇన్‌స్పైర్ చేసేలా వాళ్లను తీర్చిదిద్దాలి. ఇదంత సులువైన జర్నీ కాదు. అయినా ప్రయత్నం వీడను!'' అంటూ తన జర్నీ గురించి చెప్పారు మిస్ సౌత్ సూడాన్.

> మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్లు కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్ళకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి.

– సరస్వతి రమ

ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

అయోమ్ టీటో మతీజ్, మిస్ సౌత్ సుడాన్

ఎండాకాలం వచ్చిందంటే గృహిణులకు చేతినిండా పనే.
ఎండను డబ్బాల్లో దాచి పెట్టాల్సిందే...
అప్పడాలు, వడియాల పని పట్టాల్సిందే!
పప్పులో.. పులుసులో.. సాంబారులో.. రసంలో...
ఇలా దేనిలో నంచుకున్నా ఆ రుచి అదుర్స్.
అన్నింటినీ మించి అప్పడం ఒక్కటి ఉంటే చాలు...
విందు భోజనం చేసిన ఫీలింగ్ వచ్చేస్తుంది.
అయితే ఎప్పటిలా రొటీన్ రుచులు కాకుండా
కాస్త వెరైటీ అప్పడాలివి... ప్రయత్నించి చూస్తారా?

అప్పడాలతో అదిరే విందు

వంటిల్లు

సగ్గుబియ్యం అప్పడాలు



కావలసినవి: సగ్గుబియ్యం – ఒక కప్పు (కడిగి, సగ్గుబియ్యం రకాన్ని బట్టి, 3 గంటలు లేదా రాత్రి అంతా నానబెట్టుకోవాలి); నీరు – సరిపడా; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; నువ్వులు – ఒక టీ స్పూన్ (అభిరుచిని బట్టి); పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టీస్పూన్ (అభిరుచిని బట్టి); నిమ్మ రసం – అర టీస్పూన్.

తయారీ: ముందుగా మందపాటి గిన్నెలో 4 కప్పుల నీరు పోసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు, నానబెట్టిన సగ్గుబియ్యంలోని నీరు వంపేసి, మరిగే నీటిలో వేసుకోవాలి. కాసేపటికి ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి పేస్ట్ వేసుకుని బాగా కలుపుకోవాలి. మంటను మీడియంకు తగ్గించి, సగ్గుబియ్యం పూర్తిగా ఉడికే వరకూ అడుగంటకుండా, మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత, అది జిగురుగా మారుతుంది. ఒకవేళ మరీ గట్టిగా అనిపిస్తే కొద్దిగా నీరు కలపవచ్చు. చివరగా నిమ్మరసం కలిపి ఒకసారి కలుపుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారనివ్వాలి. మరీ పూర్తిగా చల్లారకుండా, గోరువెచ్చగా ఉండగానే, ఒక ప్లాస్టిక్ షీట్‌ను ఎండలో లేదా ఇంట్లోనే నేల మీద పరచుకుని, ఒక చిన్న స్పూన్ సహాయంతో కొద్ది కొద్దిగా సగ్గుబియ్యం మిశ్రమాన్ని గుండ్రంగా లేదా మీకు నచ్చిన ఆకారంలో అప్పడాల్లాగా వేసుకోవాలి. ఒకదానికొకటి కాస్తంత దూరం ఉంచాలి. వీటిని 2 లేదా 3 రోజుల పాటు ఎండలో బాగా ఆరనివ్వాలి. అప్పడాలు గట్టిగా తయారవ్వాలి. ఒకవైపు ఆరిన తర్వాత రెండోవైపుకు తిప్పి ఆరబెట్టాలి. అప్పడాలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.

మిరియాల అప్పడాలు



కావలసినవి: బియ్యం పిండి – ఒక కప్పు; మిరియాల పొడి – 2 టీస్పూన్లు; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– అర టీస్పూన్; వంట సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ఒక గిన్నెలో కప్పు నీళ్లు పోసి మరుగుతుండగా మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి, వంటసోడా వేయాలి. కాసేపు మరిగాక అందులో బియ్యం పిండి వేసి అడుగంటకుండా బాగా కలపాలి. స్టవ్ మీదినుంచి దించేసి కాస్త చల్లారాక అందులో రెండు స్పూన్ల నూనె వేసి మరోసారి కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని గుండ్రని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఎండలో ఒకటి లేదా రెండు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు.

టమాటో అప్పడాలు



కావలసినవి: టమాటోలు – అరకేజీ; బియ్యం పిండి – రెండు కప్పులు; సగ్గుబియ్యం – కప్పు (నానబెట్టినవి); పచ్చిమిర్చి – 2 లేదా 3 (కట్ చేసి పేస్ట్‌లా చేసుకోవాలి); ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– టీస్పూన్; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: టమాటోలను బాగా కడిగి, కట్ చేసి, మెత్తగా, గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో బియ్యంపిండి, నానబెట్టిన సగ్గుబియ్యం, టమాటో గుజ్జు, తరిగిన పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. ఈ అప్పడాలను ఎండలో 2 లేదా 3 రోజుల పాటు బాగా ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత వాటిని నిల్వ చేసుకోవచ్చు.

కూల్ రూఫ్ టెక్నాలజీ



కూల్ సమ్మర్

పెరుగుతున్న వేడిని తట్టుకోవడానికి సామాన్యులు తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో కూల్ రూఫ్స్ ప్రోగ్రామ్ ఒకటి. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా టైటానియం ఆక్సైడ్‌లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ప్రత్యేకమైన వైట్ పెయింట్‌ను రూఫ్ టాప్‌లకు వేస్తారు.

దీనికి ముందు రూఫ్‌ను చెత్త, మురికి లేకుండా శుభ్రపరుస్తారు. 'వైట్ పెయింట్ వల్ల ఏ మేరకు ఫలితం ఉంటుంది?' అనే విషయానికి వస్తే... ఉష్ణోగ్రతలలో చెప్పుకోదగ్గ తగ్గుదల కనిపిస్తుందని ప్రాథమిక పరీక్ష ఫలితాలు తెలియజేస్తున్నాయి. 'సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ నార్మల్ పెయింట్ కాదు' అంటుంది అహ్మదాబాద్‌లోని 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' మేనేజర్ దీపిక వద్గామ.

'రూఫ్‌కు రెండుసార్లు పెయింట్ వేయడం మంచిది. మొదటి లేయర్‌కు, రెండో లేయర్‌కు మధ్య కనీసం రెండు గంటల విరామం ఉండాలి' అంటుంది దీపిక. 'అధిక వేడి వల్ల ఇబ్బంది పడకుండా హోమ్–బేస్ వర్కర్స్‌కు కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. వారు చేసే పనికి అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది' అంటుంది దీపిక. అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజ బస్‌స్టాప్‌ను 'కూల్ బస్ స్టాప్'గా క్లైమేట్–ఫ్రెండ్లీగా డిజైన్ చేశారు.

'ఒకప్పుడు వేసవికాలంలో ఇంట్లో ఉండడం కష్టంగా ఉండేది. వేడి తట్టుకోలేక కుట్టుమిషన్ పని ఆపేయాల్సి వచ్చేది. సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వల్ల ఇంట్లో వేడి బాగా తగ్గింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకోగలుగుతున్నాను. వచ్చే సంవత్సరం కూడా రూఫ్‌కు వైట్ పెయింట్ వేయిస్తాను' అంటుంది సంగీత బెన్ అనే గృహిణి.